

వేంపల్లిరెడ్డి నాగరాజు

# నిశ్చయం

ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది. 'పోస్ట్' అన్నకేక వినిపించడంతో హడావుడిగా ఆఫీసుకు వెళ్లేందుకు తయారవుతున్న నేను హాల్లోనుంచి వరండాలోకి వచ్చి నిల్చున్నాను. "పెళ్లిపత్రిక సార్, పంపినవారు స్టాంపులు తక్కువ అంటించారు, రెండు రూపాయలు 'డ్యూ' కట్టండి" అన్నాడు పోస్ట్‌మేన్. ఉదయాన్నే ఇదేం గొడవరాబాబూ అనుకుంటూ జేబులో నుంచి చిల్లర తీసి పోస్ట్‌మేన్ చేతిలో పెట్టాను అతడు అందించిన వెడ్డింగ్ కార్డు అందుకుంటూ.

కవర్‌లో నుంచి పత్రిక బయటకు లాగాను. దాంతోపాటుగా చిన్న సైజు చీటీలాంటి వుత్తరం బయటపడింది. "మిత్రుడు నాగరాజుకు మధు వ్రాయునది. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో ఎక్కువ సమయం లేకుండా ఈనెల 28న నాపెళ్లి తిరుమలలో జరిగే విధంగా నిశ్చయింపబడింది. వ్యక్తిగతంగా వచ్చి కలిసే సమయంలేక సెల్‌ఫోన్ ద్వారా ప్రయత్నించాను. నీ మొబైల్ స్విచ్ ఆఫ్ చేసినట్లుగా మెసేజ్ వినిపించింది. ఆఫీస్ నెంబర్‌కు ట్రై చేస్తే నువ్వు క్యాంపులో వున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలు పెళ్లికి వచ్చినపుడు వివరిస్తాను. నీ శ్రీమతిని, పిల్లలను తప్పక తీసుకుని వచ్చేది. పెళ్లికి కనీసం రెండు రోజులన్నా ముందుగా వస్తే ఏర్పాట్ల విషయంలో కాస్తంత తోడుగావుండే వీలుంది. మరచిపోవద్దు." అని వుందా చీటీలో. మధు ఇంత హడావిడిగా పెళ్లి చేసుకుంటున్నాడంటే వాడి ప్రేమకు ఇంట్లో గ్రీన్‌సిగ్నల్ లభించి వుండవచ్చను కున్నాను.

కార్డులో పెళ్లి 28 బుధవారం అని వుండడంతో క్యాలెండర్ వైపు చూశాను. వ్యవధి మరో నాలుగు రోజులు మాత్రమే వుంది. ఉత్తరంలో మధు కోరినట్లుగా రెండు రోజులు ముందుగానే వెళ్లక తప్పని పరిస్థితి. వాడితో అనుబంధం అలాంటిది మరి. ఈ విషయమే ఆలోచిస్తుండగా...

"ఏమిటండీ మీ వాలకం... ఆఫీసుకు తొందరగా వెళ్లాలని ఉదయం నుంచి నన్ను ఒత్తిడి చేస్తూ మీరిలా నింపాదిగా నిల్చునివున్నారే" రుసరుసలాడుతూ వంటగదిలో నుంచి నావద్దకు దూసుకొచ్చింది నా శ్రీమతి శైలజ. నాపై విసుగును ప్రదర్శిస్తున్న ఆవిడ వాలకానికి సమాధానం అన్నట్లుగా పెళ్లిపత్రిక చేతికి అందించాను. ఓ నిముషంసేపు పత్రికను నింపాదిగా చదివి "ఇన్నాళ్లకైనా మధూ అన్నయ్య ఓఇంటి వాడు కాబోతున్నాడన్నమాట, సంతోషం" అంది.

జవాబుగా నవ్వాను.

"మరి ప్రయాణానికి ఏర్పాట్లు చేయమంటారా?" అడిగింది.

"రేపెలాగూ ఆదివారమే కాబట్టి ఈ ఒక్క రోజుకు పిల్లల్ని బడిమాన్పించి మధ్యాహ్నమే బయలుదేరి వెళదాం" అన్నాను నాకున్న తిరుమల దర్శనం మొక్కుబడిని గుర్తుచేసుకుని,

స్వామికార్యం, స్వకార్యం ఒక్కసారే పూర్తవుతా యన్న ఉద్దేశ్యాన్ని వ్యక్తంచేస్తూ.

"సోమవారం నుంచి తేజకు పరీక్షలు ప్రారంభమవుతున్నాయికదా... మేమూ రావడానికి ఎలా కుదురుతుందండీ" ప్రశ్నించింది మా ఆవిడ... మా పెద్దమ్మాయి పరీక్షల విషయాన్ని గుర్తుచేస్తూ.

"నిన్ను, పిల్లలనూ తీసుకెళ్లకుంటే వాడు గొడవ చేస్తాడేమో" సందేహాన్ని వెలిబుచ్చాను.

"పరిస్థితి వివరిస్తే ఆ మాత్రం అర్థం చేసుకుంటాడు లెండి" అంది విషయం ఇంతటితో సరి అన్నట్లుగా చూస్తూ.

ఆరోజుకు లంచ్‌బాక్స్ అవసరంలేదని, మధ్యాహ్నం ఇంటికేవచ్చి భోంచేసి తర్వాత బయలుదేరుతానని, ఈలోగా ప్రయాణానికి అవసరమైన బట్టలు, ఇతర సామాగ్రి సర్దిపెట్టమని చెప్పి స్కూటర్‌పై ఆఫీసుకు వెళ్లిపోయాను.

'అత్యవసరంగా వూరికి వెళ్లాల్సిన పని ఉందని, మధ్యాహ్నం నుంచి పర్మిషన్ కావాలని' మాసెక్షన్ ఆఫీసర్ ప్రసాద్‌ని అడిగాను. దాంతో పాటు సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు శెలవుకు కూడా దరఖాస్తు చేశాను. మా ఆఫీసర్ ఏకళనున్నాడోగాని ఏరకమైన పేచీపెట్టకుండా శెలవు మంజూరుతోపాటు, పర్మిషన్ కూడా ఇవ్వడంతో ఇదంతా తిరుమల వెంకన్న మహాత్మ్యంగా భావించి హాయిగా వూపిరి పీల్చుకున్నాను. క్యాంపుకు వెళ్లి వచ్చి, ఆ పనికి సంబంధించిన నివేదికలు తయారుచేసుకుంటున్న నా వద్దకు వచ్చాడు ప్రక్కసీటు కొలీగ్ రవీంద్ర. సమయం పదకొండు గంటలు కావస్తుండగా నేనూ, రమేష్ కాఫీ కోసమని క్యాంటీన్ వైపు వెళ్లాం. క్యాంటీన్ కుర్రాడు అందించిన కప్పుల్ని తీసుకొని అక్కడే వున్న బెంచీపై సెటిలయ్యాం.

"ఏంటోయ్! నాలుగు రోజుల పాటు సెలవు పెట్టావటగా. ఏమిటి విషయం?" ప్రశ్నించాడు రవీంద్ర.

వాళ్లకి చెప్పాలా వద్దా అన్నట్లుగా కొద్ది సేపు తటపటాయించాను. ఎందుకంటే తిరుమల వంటి పుణ్యక్షేత్రాలకు, ఇతర యాత్రాస్థలాలకూ వెళ్లేటపుడు ఎవరికీ చెప్పకుండా పోవడం నా అలవాటు. ఈ రకంగా వెడుతున్నట్లు చెబితే ఆ ప్రాంతాల్లో దొరికే తమకు కావాల్సిన వస్తువు లేవయినా తీసుకురమ్మని చెప్పడం, మొహమాటానికిపోయి ఎంతో శ్రమకోర్చి తీసుకువస్తే ఆ సరుకు బాగాలేదనో, ధర మరీ ఎక్కువగా చెల్లించామనో మొహంమీదే చెప్పి నిష్ఠూరం చేస్తారు. ఈ తరహా అనుభవాలు గతంలో అనేకం వుండబట్టే ఇప్పుడు కూడా చెప్పాలా వద్దా అని సందేహిస్తుండగా...

రవీంద్ర మళ్లీ రెట్టించి అడిగేసరికి ఇక తప్పదన్నట్లుగా విషయం చెప్పాను.

గత ఆరు నెలలుగా తాను కూడా తిరుమల మొక్కబడి వాయిదా వేస్తూ వస్తున్నానని, రేపె లాగూ ఆదివారం కాబట్టి తాను కూడా నాతో పాటుగా వస్తానన్నాడు రవీంద్ర.

తిరుమల యాత్రకు ఒంటరిగా కాక ప్రయాణంలో కాస్తంత తోడుగా ఎవరైనా ఉంటే కాలక్షేపం కూడా అవుతుందన్న ఉద్దేశ్యంతో సరే రమ్మన్నాను.

ప్రయాణం మాత్రం మధ్యాహ్నమేనని చెప్పాను. అందుకు ఒప్పుకున్నాడు. ఆ మేరకు మధ్యాహ్నం భోజనానికి వెళ్లినపుడు లగేజీ తీసుకుని, నేరుగా బస్టాండుకు వచ్చేయమన్నాను.

ఆపై క్యాంటీన్ నుంచి నేరుగా ఇంటికివెళ్లి

ఫోంచేసి, రెండు గంటల ప్రాంతంలో ఆటోలో బస్టాండుకు చేరుకున్నా. మరో పదినిమిషాలకు రవీంద్ర కూడా తన లగేజీతో పాటు వచ్చి నన్ను కలుసుకున్నాడు. రాయచోటి డిపో నుంచి రెండున్నర గంటలకు తిరుపతి బస్సు కోసం ఎంక్వయిరీ కౌంటర్ వద్దకు వెళ్లి వాకబుచేశాం. బస్సు మరో పావుగంటలో వస్తుందని చెప్పారు కౌంటర్‌లోని ఉద్యోగి.

మా లగేజీ బస్టాండ్‌లోనే ఓ మూలగా వున్న బెంచీపై పెట్టి బస్సు కోసం ఎదురుచూస్తూ ఓ అరగంటసేపు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ గడిపాం నేను, రవీంద్ర.

కౌంటర్‌లోని ఉద్యోగి చెప్పినట్లుగా పావు గంటలో కాకున్నా మూడున్నర గంటల ప్రాంతంలో డిపో నుంచి నేరుగా వచ్చి ఆగింది బస్సు. అసలే బస్సు ఆలస్యంగా రావడం, ఆ సమయంలో తిరుపతికి వెళ్లేందుకు మరో బస్సు లేకపోవడంతో ఎక్కడెక్కడో బాతాఖానీల్లో మునిగివున్న ప్రయాణీకులంతా ఒక్కసారిగా బస్సుని చుట్టుముట్టారు. పైగా ఆరోజు శని వారం కావడంతో ప్రయాణీకుల సంఖ్య ఎక్కువ గానే వుంది. వారందరినీ చూసి... సీటు సంపా దించుకోకుంటే నాలుగు గంటలు నిల్చునే ప్రయాణించాల్సి వస్తుందన్న వూహ మెదడుని ఆక్రమించడంతో హడావిడిగా బస్సు వద్దకు చేరి కిటికీగుండా చేతి రుమాలుని వేయడం ద్వారా ఓ సీటుని స్వంతం చేసుకున్నా. అప్పటికి గానీ కుదుటపడిందిగాదు నా ప్రాణం. ప్రయాణీ కులు ఎవరికి వారు తామే ముందుగా బస్సులో జొరబడాలనే తలంపులో ఓ పదినిమిషాల సేపు జరిగిన తోపులాట పూర్తికాగానే బస్సు పూర్తిగా నిండిపోవడంతో కండక్టర్ రైట్ చెప్పి, టిక్కెట్లు కొట్టడం ప్రారంభించాడు. సీట్లలో కూర్చున్న ప్యాసింజర్ల కంటే రెట్టింపు సంఖ్యలో ప్యాసిం జర్లు నిల్చునేవున్నారు. కండక్టర్ మరో మారు హెచ్చరించడంతో నిండుగర్భిణిలా మెల్లగా బయలుదేరింది బస్సు.

మా సీటు సమీపంలోనే నిల్చునివున్న ఒకా విడ చేతిలోని పసికందుని వూరడించలేక సత మతమవుతోంది. ఆమెకు సమీపంలోనే నిల్చుని వున్న మరో వ్యక్తి ఆమె భర్త కాబోలు నాలుగు సంవత్సరాల వయస్సున్న ఓ అమ్మాయిని ఎత్తు కుని, దాదాపు ఆరు సంవత్సరాల వయస్సున్న అమ్మాయిని తన వద్దే నిల్చోబెట్టుకుని వున్నాడు. నిల్చున్న అమ్మాయి తనకు కాళ్లునొప్పెడుతున్నా యని, తాను సీటులో కూర్చోవాలనీ మారాం చేస్తోంది. చేతిలో వున్న అమ్మాయి తనకు బిస్కట్లు కావాలని బిగ్గరగా ఏడుస్తోంది. ఎంత సర్దిచెప్పినా వినకపోవడంతో పిల్లలిద్దరినీ ఓ నాలుగు బాదాడు ఆ తండ్రి. దాంతో మరింతగా గొంతుపెంచి ఏడవడం ప్రారంభించారు పిల్ల లు. అధిక సంఖ్యలో నిల్చునివున్న ప్రయాణీకుల కారణంగా బస్సులో ఉక్కపోతకు తోడు పిల్లల్ల ఏడుపులు, కేకలూ అందరికీ ఇబ్బంది కలిగిస్తు న్నట్లుగా వున్నాయి. అందరూ తనవంకే అదో లా చూడడం గమనించినతను ఏడుపు మానేస్తే బస్సు దిగగానే బిస్కట్ పాకెట్లు తీసిస్తానని చెప్పాడు పిల్లలిద్దరికీ. చేతిలోని చంటిపిల్ల ఏడు పయితే మానిందిగానీ, నిల్చునివున్న పాప తనకు సీటుకావాల్సిందేనని మరింత మారాంచేస్తోంది.

ఈ గోల భరించలేని రవీంద్ర ఆ అమ్మా యిని తన వద్దకు పిల్చుకుని ఒడిలో కూర్చోబెట్టు కున్నాడు. దాంతో గొడవ కొంతమేర తగ్గింది. బస్సు మరో పదినిముషాల్లో సంబేపల్లి మండల కేంద్రానికి చేరుకుంది.

ఈలోగా రవీంద్ర వద్ద కూర్చునివున్న అమ్మాయి మళ్లీ ఏడుపు ప్రారంభించింది. విష యం ఏమిటని అడిగాడు. తాను అత్యవసరంగా


బహిర్భూమికి వెళ్లాలని చెప్పింది. ఆ విషయన్నే వాళ్ల నాన్నతో చెప్పాడు రవీంద్ర.

అడ్డంగా వున్న ప్రయాణీకులను నెట్టుకుంటూ డ్రైవర్ వద్దకెళ్లి అభ్యర్థించినట్లున్నాడా వ్యక్తి. డ్రైవర్ తన విసుగును, కోపాన్ని ప్రదర్శిస్తూ తొందరగా వెళ్లి రమ్మని కసురుకున్నాడు.

అమ్మాయిని తీసుకుని క్రిందకి దిగినతను మరో పది నిముషాల్లో రాగానే బస్సు బయలు దేరింది. తిరిగి ఆ పాప రవీంద్ర వద్దకే వచ్చి కూర్చుంది. ఆ పాపను బలవంతంగా మోస్తున్న వాడిలా ఇబ్బంది పడుతున్న రవీంద్ర... వాళ్ల నాన్న నుద్దేశించి "మీరు ఎంత దాకా వెళ్లాలి సార్?" అని అడిగాడు ఇంకెంతసేపు ఈ బాధ భరించాలన్న విసుగును ధ్వనింపజేస్తూ.

"తిరుమల వెడుతున్నామండీ. మాది రామాపురం. నా పేరు సురేష్. నేను అక్కడే రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్నా" అన్నాడతను మాట కలుపుతూ.

ఆ సమాధానానికి ఆముదం త్రాగిన వాడిలా మొహం పెట్టాడు రవీంద్ర. ఈ విషయంలో తనకెంత మాత్రం సంబంధం లేదన్నట్లుగా మరో గంటకల్లా బస్సు పీలేరు బస్టాండుని చేరడంతో నిల్చునివున్న ఓ జంట అక్కడ దిగిపోవడంతో ఖాళీ అయిన సీటుని దక్కించుకునేందుకు చేతిలోని న్యూస్ పేపర్‌తో ఆక్రమించి, వాళ్లను కూర్చోమన్నాడు రవీంద్ర. తన భార్యతో



విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రమ్యభారతి నిర్వహించిన 'అనురాగాల మర్మాలు' గ్రంథావిష్కరణ సభలో కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావు, డా॥ జి.వి. పూర్ణచంద్, ఆకాశవాణి సంచాలకులు శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్, ప్రముఖ రచయిత శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య. కృతికర్త దొండపాటి దేవదాసు, స్వీకర్త ఎం. సత్యనారాయణరావు, పువ్వాడ తిక్కన సోమయాజి. కాటూరు రవీంద్ర త్రివిక్రమ్.

సహా ఆ సీటులో సెటిలైన ఆ వ్యక్తి మావంక చూస్తూ 'థ్యాంక్స్ సార్" అన్నాడు. అయితే వాళ్ల పెద్దమ్మాయి మాత్రం మా రవీంద్రని వీడి పోలేదు.

దిగిన ప్రయాణీకుల స్థానంలో మరికొందరు ప్రయాణీకులు ఎక్కడంతో బస్సుని బయలుదేరదీసాడు డ్రైవర్. ఈలోగా చిన్నమ్మాయి బస్టాండులోని దుకాణాల వైపు చూస్తూ తనకు బిస్కట్లు కావాలని మళ్లీ ఏడుపు ప్రారంభించింది. వచ్చే స్టేజిలో బస్సాగగానే తీసిస్తానని సర్దిచెప్పాడు వాళ్ల నాన్న. మరో అరగంటలో బస్సు భాకరాపేట చేరింది. టైర్లలో గాలిని చెక్ చేసేందుకు డ్రైవర్ బస్సు దిగడంతో సురేష్ కూడా బస్సు దిగి, బిస్కట్లు తేవడానికని వెళ్లాడు.

డ్రైవర్ వచ్చి బస్సుని కదిలించడంతో మా ముందు సీట్లో కూర్చుని వున్న సురేష్ శ్రీమతి "సార్ మా వారు బస్సుదిగి వెళ్లారు ఇంకా రాలేదు కొంచెం సేపు బస్సుని ఆపమని చెప్పండి" అంది మావంక అభ్యర్థనగా చూస్తూ. ఈ మాటలు విన్న కండక్టర్ "ఏంటమ్మా మీ గోల. అనుకున్న సమయానికి బస్సుని చేరనిచ్చేట్లుగా లేరే" అన్నాడు అసహనంగా.

"ఏమండీ బస్సు బయలుదేరుతోంది రండి" అంటూ ఆవిడ కిటికీలోనుంచే గావుకేక పెట్టడంతో పరుగెత్తుకుంటూ వచ్చి బస్సెక్కాడు సురేష్.

తిరిగి ప్రారంభమైంది మా ప్రయాణం. ఆ తరువాత ఎక్కడా ఆగకుండా ఏడున్నర గంటల ప్రాంతంలో తిరుపతి బస్టాండుకి చేరుకుంది.

బస్సు దిగిన మేము నేరుగా అక్కడే వున్న క్యాంటీన్ చేరుకున్నాం ఏదైనా టిఫిన్ తిందామన్న ఉద్దేశ్యంతో. రాయచోటి నుంచి మాతో పాటుగా ప్రయణిస్తూ వచ్చిన సురేష్ కూడా లగేజీలతో, పిల్లలతో అవస్థపడుతూ క్యాంటీన్ లోకి వచ్చి చేరాడు. వాళ్లంతా మా ప్రక్క టేబుల్ ని ఆక్రమించారు. వీళ్ల కదలికలను నేను, రవీంద్ర ఇరువురం గమనిస్తూనే వున్నాం. చందమామ కథల పుస్తకం తెచ్చిస్తే తప్ప తాను అన్నం తిననని మొండి కేసింది పెద్ద పిల్ల. ఇక తప్పదన్నట్లుగా ఆ అమ్మాయిని వెంట బెట్టుకుని హోటల్ నుంచి పుస్తకాల స్టాల్స్ వైపు వెళ్లాడు సురేష్. వాళ్ల నాన్న వెంట కొద్ది దూరం వెళ్లిన రెండో పాప అక్కడే మలుపులో వున్న ఐస్క్రీం బండి వైపు తిరిగి నిల్చుండిపోయింది. ఈ విషయం గమనించని సురేష్ యధాలాపంగా చందమామ పుస్తకంతో మళ్లీ క్యాంటీన్ లోకొచ్చి అక్కడ తన రెండో కూతురులేని విషయం గుర్తించి ఆ మాటే తన భార్యను అడిగాడు. "ఇందాక మీ వెంటే వచ్చింది కదండీ" అందావిడ అమాయకంగా. "నా వెంట రావడం ఏమిటే పిచ్చిమొహమా" అంటూ కోపంతో ఆవిడపై చెయ్యిచేసుకోబోయాడు.

జరగబోయేదాన్ని పసిగట్టిన నేను అతడి ప్రయత్నాన్ని వారిస్తూ వాళ్ల చిన్నమ్మాయి ఐస్క్రీం బండి వద్ద వున్న విషయం చెప్పాను. ఆయాసపడిపోతూ ఆవైపు పరుగెత్తినతను ఆ అమ్మాయిని చెంప ఛెళ్లుమనిపించి వెంటబెట్టుకుని వచ్చాడు.

టిఫిన్ల తతంగం పూర్తికావడంతో నేను, రవీంద్ర తిరుమల వెళ్లే బస్సెక్కాము. బస్సు కదలబోతూండగా మళ్లీ మా బస్సులోకే ప్రవేశించాడు సురేష్ తన భార్యపిల్లలతో. కిటికీ ప్రక్కన నేనంటే నేను కూర్చోవాలంటూ పిల్లిలిద్దరూ మళ్లీ గొడవపడడం ప్రారంభించడంతో ఈసారి చిన్నమ్మాయిని దగ్గరకు పిలుచుకుని నా ప్రక్కనే కిటికీ వారగా కూర్చోబెట్టుకున్నా. బస్సు అలిపిరి

ఘాట్‌రోడ్డు దాటగానే తనకు నీళ్లు కావాలంది ఆ అమ్మాయి. రవీంద్ర వద్దనున్న వాటర్ బాటిల్ లోని నీటిని జాగ్రత్తగా తాపించా. మరో అర గంటలో బస్సు తిరుమల చేరడంతో అక్కడే దేవస్థానంలో ఉద్యోగిగా పనిచేస్తున్న నా బాల్య మిత్రుడు త్యాగరాజు సహకారంతో కాటేజీ సంపాదించుకుని స్నానాదికాలు ముగించి, రాత్రి పది గంటల ప్రాంతంలో దైవదర్శనానికి బయలుదేరాం నేను, రవీంద్ర.

ఉచిత దర్శనం క్యూ వైపు భక్తులు ఎక్కువగా ఉండడంతో ప్రత్యేక ప్రవేశద్వారం వైపు వెళ్లిన మాకు మళ్లీ అక్కడ కనిపించాడు సురేష్ తన భార్యాపిల్లలతో. మమ్మల్ని చూడగానే పరుగున మా వద్దకు వచ్చి "కాటేజీ ఎక్కడా దొరకలేదు సార్. అందుకనే సామాన్లన్నీ లాకర్‌లో పెట్టేసి నేరుగా దర్శనానికి వచ్చేశాం" అన్నాడు. "రామే శ్వరం వెళ్లినా ఈ శనేశ్వరం బాధ తప్పేట్లులేదే" అని మనసులోని మాటను బయటకే అనేశాడు రవీంద్ర నుదురు బాదుకుంటూ. ఆ మాటలతో నొచ్చుకున్నట్లుగా తలదించుకున్నాడు సురేష్. దర్శనం కోసం నిర్దేశించిన వెయిటింగ్ రూమ్ లోకి మాతో పాటుగా ప్రవేశించిన సురేష్ దంప తులు మళ్లీ మా వెనుక వైపునే వున్న బెంచీపై సెటిలయ్యారు. మరో అరగంటలో గేట్లు తెరవ డంతో క్యూ కదలడం ప్రారంభమైంది. సురేష్ అప్పటివరకు బెంచీపై నిద్రపోతున్న పిల్లలద్దరినీ లేపేందుకు ప్రయత్నం చేయగా, వాళ్లు తామెక్క డికీ రామని అక్కడే పడుకుంటామనీ మొండి కేసారు. ఓపిక నశించిన సురేష్ తన ఖర్మకు తననే నిందించుకుంటూ పెద్దమ్మాయిని భుజం పై కూర్చుండబెట్టుకుని, రెండో అమ్మాయిని చంకనేసుకుని భార్యతో సహా మా వెంట 'క్యూ' లో కదలడం ప్రారంభించాడు.

ఆ రోజు శనివారం కావడం మూలంగా భక్తులరద్దీ ఎక్కువగా వున్నందున జరుగుతున్న తోపులాట కారణంగా తల్లి భుజాలపై నిద్రస్తున్న మూడో పాప గుక్కుతిప్పుకోకుండా ఏడవ సాగింది. ఒక్కసారిగా అంతమంది జనాన్ని చూసిన రెండో పాప కూడా ఏడుపు లంకించు కోగా ఆ కేకలు భక్తుల గోవిందనామస్మరణలో కలసిపోయాయి. మరో పావుగంటలో దైవ దర్శనం పూర్తవుతూందనగా ఎప్పటినుంచో తీర్చుకోవాలనుకుంటున్న తన లఘుశంక అవ సరం మరీ ఒత్తిడి చేయడంతో సురేష్ తన దీన పరిస్థితిని మాకు వివరించి పిల్లలిద్దరినీ నాకు, రవీంద్రకూ కట్టబెట్టి అక్కడే వున్న సెక్యూ రిటీ గార్డు సాయంతో దేవుడిని దర్శించుకో కుండానే బయటకు వెళ్లిపోయాడు. సురేష్ పిల్లలను చెరొకరిని ఎత్తుకుని ఏడుకొండలవాడి గుడిబయటకొచ్చాం.

అక్కడ మా కోసమే ఎదురుచూస్తున్నట్లుగా కాచుకునివున్న సురేష్ పిల్లలిద్దరినీ తన వద్దకు తీసుకుని మరోసారి 'థ్యాంక్స్ సార్" అన్నాడు. సరేనంటూ మేము బయలుదేరబోతూండగా గబగబా మా ముందుకు వచ్చి "సార్" అంటూ మరో మారు పిలిచాడు. మళ్లీ ఏమిటయ్యా నీ గోల అంటూ రవీంద్ర విసురుగా సురేష్ వైపు వెళ్లబోయాడు. "జేబులో వున్న మనీ పర్సు ఎవరో కొట్టేశారు సార్, తిరిగి ఇంటికి వెళ్లేం దుకు కూడా డబ్బులు లేవు" అని అన్నాడు సురేష్ విచారంగా నా వంకే చూస్తూ.

ఇదే అవకాశంగా భావించిన రవీంద్ర అతనిపై విరుచుకుపడ్డాడు. "బుద్ధుందటయ్యా నీకు... చదువుకున్నవాడివి, పైగా ఉద్యోగం చేస్తునన్నానంటున్నావు. ఇంత మంది పిల్లలను కని, ప్రతిక్షణం ఇబ్బందులు పడడం ఎం దుకు?" అని.

ఇక మందలించిందిచాల్లే... అంటూ రవీం

ద్రని ప్రక్కకులాగి జేబులోనుంచి ఓ వంద రూపాయలు తీసి సురేష్ చేతిలో పెట్టా... నేను చేసే సాయం ఇంతేనన్నట్లుగా. ఆ తర్వాత రవీంద్ర తొందరపెట్టడంతో ప్రసాదాలు ఉదయాన్నే తీసుకుందామని కాటేజీ చేరుకున్నాం.

మధ్యాహ్నం నుంచి సురేష్ దంపతుల, పిల్లల చేష్టలతో బాగా విసిగిపోయివున్న రవీంద్ర సీరియస్‌గా నా వైపు ఓసారి చూసి "నాగరాజూ నేనో నిర్ణయం తీసుకున్నా" అన్నాడు గంభీరంగా. అలసటతో మంచంపై నడుంవాల్చేందుకు ఉపక్రమిస్తున్న నేను విషయం ఏమిటని అడిగా.

"అధిక సంతానం కారణంగా తిరుమల ప్రయాణంలో సురేష్ పడిన ఇబ్బందులన్నీ కళ్లారా గమనించిన నేను ఒక్కరి కంటే ఎక్కువ మంది పిల్లలు అక్కరలేదని దైవసన్నిధిలో మనఃసాక్షిగా ప్రమాణం చేసుకున్నా" అన్నాడు. నానాటికీ పెరిగిపోతున్న అధిక జనాభా కారణంగా దేశం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని రవీంద్ర తీసుకున్న నిర్ణయం నన్ను ఆనందంలో ముంచెత్తింది. అయితే అంత క్రితమే దేవుడి సన్నిధిలో 'స్వామీ మూడో సంతానాన్నయినా నాకు మగబిడ్డగా ప్రసాదించు' అని కోరుకున్న కోర్కె గుర్తొచ్చిన నాకు రవీంద్ర నిర్ణయం ఛెర్నాకోలతో ఛెళ్లున బాదినట్లనిపించింది. వెంటనే నేను కూడా రవీంద్ర మాటలకు స్పందిస్తూ "నీలాగే నేను కూడా ఓ మంచి నిర్ణయం తీసుకుంటున్నా రవీంద్రా" అన్నాను. ఏమిటన్నట్లు చూశాడు.

"మనకు మగపిల్లాడు కావాలండీ" అంటూ గత నాలుగేళ్లుగా నా శ్రీమతి శైలజ మూడవ సంతానం గురించి చేస్తున్న ఆలోచనలకు స్వస్తి పలికించే విధంగా ఆవిడని ఒప్పిస్తా" అన్నాను.

"ఒకప్పుడు ఒకరు లేదా ఇద్దరు చాలు అనేవారు నాగరాజూ. కానీ నేటి రోజుల్లో మనలాంటి వాళ్లమైనా వన్ ఆర్ నన్ అనుకుంటే మన వంతుగా దేశాభివృద్ధికి సహకరించిన వాళ్లమవుతాం" అన్నాడు రవీంద్ర నా మాటలకు నవ్వుతూ నన్ను అభినందిస్తున్నట్లుగా.

కాటేజీలో లైట్లు ఆర్పేసి పడుకోబోతుండగా రవీంద్ర మళ్లీ "నాగరాజూ" అంటూ పిలిచాడు. నిద్ర పూర్తిగా ఎగిరిపోవడంతో ఏమిటని అడిగా. "నువ్వు మరోలా భావించకుంటే ఓ మాట అడగాలనుకుంటున్నా" అన్నాడు. పర్వాలేదు చెప్పమన్నాను. "నాకు పెళ్లయి తొమ్మిదేళ్లవుతోంది. పిల్లలు పుడతారన్న ఆశ ఇంకా చావలేదు. నీకెలాగూ ఇద్దరు కూతుళ్లు కాబట్టి మీ రెండవ అమ్మాయి వైష్ణవిని మాకు ఇచ్చేయరాదూ... మేము పెంచుకుంటాం" అన్నాడు.

అతడి ప్రపోజల్ వినడంతోనే ఇప్పటి వరకూ ఆఫీస్‌లో కేవలం కొలీగ్స్‌గా వున్న మా పరిచయం ఈరకంగా చేయడం ద్వారా మరింతగా బలపడుతుందనుకుని "సరే"నని అంగీకారం తెలిపాను... నా శ్రీమతిని ఒప్పించడం సులభమేనా అని ఆలోచిస్తూనే.

ఈ మేరకు తన శ్రీమతిని కూడా ఒప్పిస్తానని చెప్పాడు రవీంద్ర. మాటల్లో పడి నిద్ర ఎగిరిపోవడంతో పాటుగా దైవసన్నిధిలో. రవీంద్ర, నేను తీసుకున్న పరస్పర నిర్ణయాలు ఆ ఏడుకొండలవాడి ఆదేశాల మేరకే జరుగుతున్నట్లునిపించింది నాకు. ఈలోగా తెల్లవారుఝాము మూడుగంటలు కావడంతో మేము తీసుకున్న నిర్ణయం దేశ పురోభివృద్ధికి తోడ్పాటు అందించే దిశగా వున్నట్లుగా, మా అభిప్రాయాలను హర్షిస్తున్నట్లుగా గర్భగుడి నుంచి శ్రీనివాసుని సుప్రభాతం ప్రారంభమయింది. ●